21, 23 తేదీలలో జాబ్ మేళా..

కాచిగూడ, సెప్టెంబర్ 20: భారత్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21, 23 తేదీలలో ఉచిత జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పంజాగుట్టలోని రాజేశ్వరి టవర్స్-304, సాయిబాబా టెంపుల్ రోడ్, ద్వారకాపురి కాలనీ, అదే విధంగా 23వ తేదీన భారత్ సేవా కేంద్రం, ఫ్లాట్ నం. 403, శ్రీనిలయం, బాటా షోరూమ్‌పైన ల్యాంకో హిల్స్ రోడ్ మణికొండలో సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన యువతకు జాబ్‌తో పాటు ఉచిత శిక్షణ ఇవ్వబడునని పేర్కొన్నారు. మేళాలో డిగ్రీ, పీజీ, ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొనవచ్చును. ఇందులో పేరొందిన ప్రైవేటు కంపెనీలు పాల్గొననున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ నం. 99593 63083.

టీ హబ్ ఆధ్వర్యంలో 27న ఇండియా ఇంటర్నెట్ డే

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): డిజిటల్ ఎకో సిస్టమ్ విస్తరిస్తున్న నేపథ్యంలో టీ హబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఇండియా ఇంటర్నెట్ డేను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన కృత్రిమ మేధస్సు పరివర్తన భవిష్యత్తులో డిజిటల్ ఎకో సిస్టమ్ ఎలా ఉంటుందన్న దానిపై జాతీయ స్థాయిలో నిపుణులు చర్చా కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీలైన మైక్రో సాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఎడబ్ల్యుఎస్) లతో పాటు వెంచర్ క్యాపిటలిస్టులు, ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈ కింది లింకు (https://events.tie.org/IndiaInternetDay2024)లో నమోదు చేసుకోవాలన్నారు.

22న సైనథాన్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఈ నెల 23న ఇంటర్నేషనల్ సైన్ లాంగ్వేజ్ డే పురస్కరించుకుని ఆదివారం (22 న) గచ్చిబౌలి స్టేడియంలో సైనథాన్ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సైన్ లాం గ్వేజ్ ప్రాధాన్యతను అందరికి అర్థమయ్యేలా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం తీసుకున్నామని పేర్కొన్నారు. 2 కిలో మీటర్ల మేర వాక్ కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఫొటోగ్రఫీ కోర్సుపై 23న ఉచిత వర్క్‌షాప్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 20: భాషా, సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ, సాంస్కృతిక సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న రవీంద్ర భారతిలోని ఆడిటోరియంలో ఫొటోగ్రఫీపై ఉచితంగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఏం.సి.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీపై అభిరుచి గలవారు వృత్తిగా స్వీకరించేవారికి ప్రాథమిక ఫొటోగ్రఫీతో పాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, కంపోజిషన్, లైటింగ్, ఫ్రేమింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఫొటోగ్రఫీ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో పట్టణ, గ్రామీణ యువతకు సహాయం చేయడమే కాకుండా ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించే వారికి ఈ వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు సెల్ ఫోన్ నం.80080 21075, 70956 92175లలో సంప్రదించాలన్నారు.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): 2024-25వ విద్యా సంవత్సరానికి 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ పరీక్ష దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు ఉన్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం http://bse.telangana.gov.in సంప్రదించాలని సూచించారు.



మహా గణపతి అవశేషాల తొలగింపు

ఇక్కడ కనిపిస్తున్న ఈ ఇనుప తుక్కు.. రెండు రోజుల క్రితం.. దైవత్వం మేళవించిన ఖైరతాబాద్ మహా గణపతి. లక్షలాది మందికి తొమ్మిది రోజుల పాటు దీవెనలు అందించిన 70 అడుగుల ఎత్తైన విఘ్నేశ్వరుడు. హుస్సేన్ సాగర్‌లో మంగళవారం సంపూర్ణంగా నిమజ్జనం అయ్యాడు. శుక్రవారం సాగరం నుంచి అవశేషాల తొలగింపులో భాగంగా దైవత్వం కోల్పోయిన మహా గణనాథుడి ఉక్కు మాతృక లభ్యమైంది. ఇలాంటివి ఎన్నో శుక్రవారం బయల్పడ్డాయి.

తాగేనీటిలో మురుగు నీరు సరఫరా!

ఆప్కో కాలనీలో కలుషిత నీటి సరఫరాను చూపుతున్న మహిళలు

ఆందోళనకు దిగిన ఆప్కో కాలనీ మహిళలు

మైలార్‌దేవపల్లి, సెప్టెంబర్ 20: ఆ కాలనీలు గత మూడు నెలలుగా తాగునీటి సరఫరాలో డ్రైనేజీలు నీరు కలుస్తూ వస్తున్నాయి. అసలే మంచినీటి సరఫరా అంతంత మాత్రం, పైగా సరఫరా చేసిన ప్రతిసారి కలుషిత నీటిని సరఫరా చేయడంతో స్థానికంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నట్టు వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఇలాంటి కలుషిత నీటిని తాగడం వల్ల ఆసుపత్రుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన స్థానికులపై లైన్‌మెన్లు, జల మండలి అధికారులు బెదిరింపులకు దిగుతూ ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి అంటూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం నీటి సరఫరా జరిగిన అనంతరం, మంచినీటిని తీసుకొని రోడ్డుపైకి వచ్చి వృద్ధులు, మహిళలు, చిన్నారులతో కలిసి ఆందోళన నిర్వహించారు. 'ఇవే నీరు మీరు తాగుతారా?' అని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. మైలార్‌దేవపల్లి డివిజన్ ఆదర్శ, ఆప్కో కాలనీలలో కొంత కాలంగా తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అయినా, ఎవరు స్పందించకపోవడంతో కాలనీ వాసులు శుక్రవారం రోడ్డెక్కారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉంటుందని వాటర్ వర్క్స్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్నారు. వర్షాలు కురుస్తూ, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితుల్లో తాగునీరు కలుషితమై రావడం పట్ల రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టించుకోని ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలపై చిన్న చూపు చూడటం బాధాకరమని, అధికారులు స్పందించి పైపులైన్ పనులు చేపట్టి, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో జల మండలి కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనిర్వచనీయమైన నటన మహానటి సొంతం

సావిత్రి క్లాసిక్స్ గ్రంథ అభినందన సభ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 20: మహానటి సావిత్రి అనిర్వచనీయమైన నటన ద్వారానే ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీ రంగారావులు మహా నటులుగా వెలుగుగొందారని, సావిత్రి తెరపై నిజ జీవితంలో నటించలేదని, ఆమె నటనలో జీవించారని పలువురు వక్తలు ప్రసంశించారు. సినీ పరిశోధకులు సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సంజయ్ కిషోర్ రచించిన 'సావిత్రి క్లాసిక్స్' గ్రంథ అభినందన సభ శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. డా.హరినాథ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సావిత్రి కుమార్తె విజయ ఛాముండేశ్వరి, కిమ్స్ అధినేత బొల్లినేని కృష్ణయ్యలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సంజయ్ కిషోర్ రచించిన సావిత్రి క్లాసిక్స్ గ్రంథ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ, సావిత్రి వీరాభిమానిగా సంజయ్ కిషోర్, వారి జీవిత చరిత్రను కాకుండా 47 చిత్రాలతో సావిత్రి నటన విశిష్టతను విశేషంగా ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు రోజా రమణి, రేలంగి నరసింహారావు, వై.విజయ, శివపార్వతి, అనంతలక్ష్మి, శివనాగేశ్వరరావు, శృతి స్వప్న పాల్గొన్నారు.

కొంపల్లిలో శైనీస్ కిచెన్‌ను నిర్వాహకులతో కలిసి ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, తదితరులు

అద్వితీయ రుచులకు శైనీస్ చిరునామా కావాలి

కొంపల్లిలో శైనీస్ కిచెన్ ప్రారంభించిన కేటీ రామారావు

హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 20: అద్వితీయ రుచులకు 'శైనీస్' చిరునామా కావాలని, రుచికి, శుచికి ఇది కేంద్రం కావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శైనీస్ కిచెన్స్ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, శైనీస్ కిచెన్ రుచికరమైన భోజనాన్ని అందిస్తూ స్థానిక వినియోగదారుల మనన్నలు పొందాలని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల రంగంలో మార్పులకు ఐటీ సిద్ధం

వాలుక రీసెర్చ్ & డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

వాలుక రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కొండాపూర్, సెప్టెంబర్ 20: సెమీ కండక్టర్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు ఐటీ రంగం సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. రాయదుర్గంలోని ఆర్బిట్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలుక రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్‌ను మంత్రి ముఖ్య అతిథిగా శుక్రవారం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి రంగంలో సెమీ కండక్టర్ల పాత్ర ఎంతో కీలకంగా మారిందని, వీటి ఉత్పత్తికి, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఉంటున్నప్పటికీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్లు మన దేశంలో నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో సెమీ కండక్టర్ల వినియోగం అవసరాలు భారీగా పెరగనున్నాయని, వాటికి అనుగుణంగా స్టార్టప్ కంపెనీలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ ఇండస్ట్రీ నీడ్స్ కోసం సిద్ధం చేసుకుంటే బాగుంటుందన్నారు. ప్రస్తుతం చైనా, తైవాన్ దేశాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటుందని, దిగుమతులు తగ్గి ఉత్పత్తులు పెరగాలంటే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

ఘనంగా గురజాడ జయంత్యుత్సవం

గురజాడకు నివాళులర్పిస్తున్న తెలుగు శాఖ అధ్యాపకులు

నవయుగ వైతాళికుడు, ఆధునిక సాహిత్యానికి వెలుగుబాట గురజాడ వేంకట అప్పారావు 153వ జన్మదినోత్సవాన్ని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురజాడ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఆచార్య పిల్లలమర్రి రాములు సభాధ్యక్షత వహించి, తెలుగు సాహిత్యానికి గురజాడ సేవ చాలా గొప్పదన్నారు. సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ కన్యాశుల్కం నాటకంలోని పాత్రల సృష్టి సమాజంలో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వర్ రావు, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య ఎం.గోవా నాయక్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య పి.వారి జారాణి, ఆచార్య వి.త్రివేణి, డా.భూక్యా తిరుపతి, డా. భుజంగరెడ్డి, డా. విజయ్ కుమార్, డా. బాశెట్టి లత, డా. విజయ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ):

ఫ్యాషన్ రంగంలో ఉజ్వల భవిష్యత్

సందడి చేసిన మిస్ తెలంగాణ, ఆంధ్ర విజేతలు ప్రకృతి కంభం, భవ్యారెడ్డి

సందడి చేసిన మిస్ తెలంగాణ ప్రకృతి కంభం, మిస్ ఏపీ భవ్యారెడ్డి

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 20: హిమాయత్‌నగర్‌లోని ఐఎన్ఐఎఫ్‌డీ (ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్)లో తెలంగాణ ఫెమీనా మిస్ ఇండియా ప్రకృతి కంభం, ఏపీ ఫెమీనా మిస్ ఇండియా భవ్యారెడ్డిలు సందడి చేశారు. సెంటర్‌లోని ఫ్యాషన్, డిజైన్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఐఎన్ఐఎఫ్‌డీ ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదునుపెట్టి వారి ప్రతిభకు తగిన అవకాశాలు కల్పిస్తోందన్నారు. అభిరుచి, అంకితభావంతో ముందుకు సాగితే అనుకున్నది ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఐఎన్ఐఎఫ్‌డీ డైరెక్టర్ సంజయ్ సారస్వత్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ 2024 ఫెమీనా మిస్ ఇండియా విజేతలు విద్యార్థులకు మంచి సందేశాన్ని ఇవ్వడం సంతోషకరమన్నారు. కెరీర్‌పై విద్యార్థులు దృష్టి సారించి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.

సీసీఎంబీలో వైల్డ్ లైఫ్ వీక్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీలోని లాకోన్స్‌లో అక్టోబర్ 4 నుంచి వైల్డ్ లైఫ్ వీక్ వేడుకలను నిర్వహించనున్నారు. పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణ, అంతరించిపోతున్న జాతుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేలా అత్తాపూర్‌లోని లాకోన్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

భాష్యం వరద సాయం రూ.కోటి 25 లక్షలు

తెలంగాణ వరద బాధితుల సహాయార్థం రూ.కోటి 25 లక్షలను భాష్యం విద్యా సంస్థలు విరాళంగా ప్రకటించినట్టు చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఈ విరాళాన్ని సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం అందించారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది చేసిన సాయమని ఆయన చెప్పారు. *- సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ);*

అస్మిత ఖేలోలో మహిళల అత్యుత్తమ ప్రదర్శన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): కేరళలోని తిరువనంతపురంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా మహిళల లీగ్‌లో మహిళలు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. ఎస్.రత్నికా మొత్తం నాలుగు పతకాలను సాధించారు. అందులో 2 రజతం, 2 కాంస్య పతకాలు ఉన్నాయి. శివ బిందు 2 కి.మీ వ్యక్తిగత పర్స్యూట్‌లో అద్భుతమైన టైం 3 నిమిషాల్లో ఒక బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ ఇద్దరు రైడర్లు ఎంటీసీడబ్ల్యూఏకు చెందిన వారు మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి కూడా మంచి పేరు తెచ్చారు. ఈ విజయోత్సవ వేడుకల్లో ఎంటీసీడబ్ల్యూ సెక్రటరీ అడ్వకేట్ ఎమ్మే పాషా పాల్గొన్నారు.

ఆద్రాస్‌పల్లి గీత కార్మికులకు భూమి కేటాయించాలి

రాష్ట్ర కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్‌కు గీత పనివారల సంఘం డిమాండ్



తాసీల్దార్ వెంకట నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గీత పనివారల సంఘం సభ్యులు

శామీర్‌పేట, సెప్టెంబర్ 20: ఆద్రాస్‌పల్లి గ్రామ గీత కార్మికులకు ఈత, తాటి వనం పెంపకానికి ప్రభుత్వం భూమిని కేటాయించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ డిమాండ్ చేశారు. ఈత, తాటి వనం భూ సమస్యను తక్షణమే పరిష్కరించి, సర్వేలు జరిపి గీత పనివారలు అందించాలని డిమాండ్ చేస్తూ మూడు చింతలపల్లి తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాసీల్దార్ వెంకట నర్సింహారెడ్డికి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆద్రాస్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 33, 173-1, 174లోని ప్రభుత్వ భూమిలో హరితహారంలో భాగంగా 3000ల ఈత మొక్కలను, 25 తాటి మొక్కలకు బిందు సేద్యం ద్వారా నీటిని అందించడం జరుగుతుందన్నారు. ఈ భూమి సమస్యలో ఉండటం కారణంగా గీత పనివారలు నష్టపోతున్నారని ఆరోపించారు. 2015లో హరితహారం క్రింద 35 మొక్కలు ప్రభుత్వం ద్వారా ఎక్సైజ్ డిపార్ట్మెంట్, రెవెన్యూ శాఖ అధికారులతో నాటడం జరిగిందన్నారు. అట్టి భూమిలో కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమికి తక్షణ సర్వే నిర్వహించి గీత పనివారలకు 10 ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగోల్ల హనుమాన్ దాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సహదేవ్, శామీర్‌పేట మండల కార్యదర్శి డీజే నరేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి ఓంకార్, మురళీధర్‌రాజు, ఆద్రాస్‌పల్లి సంఘం అధ్యక్షుడు రంగానాగేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు గంగల వీరస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్ గౌడ్, రంగా భాస్కర్ గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐ ఫోన్-16 లాంచ్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): సెలెక్ట్ మొబైల్స్‌లో ఐ ఫోన్-16 సిరీస్‌ను సంస్థ ఎండీ వై.గురు లాంచ్ చేశారు. లాంచింగ్ సందర్భంగా ఐ ఫోన్-16 సిరీస్‌ను కొన్నవారికి రూ.5000 వరకు ఇన్సెంట్ క్యాష్ బ్యాక్, రూ.6 వేల వరకు అప్‌గ్రేడ్ బోనస్ పొందొచ్చని వివరించారు. కస్టమర్స్‌కు అతి తక్కువ ఈఎంఐ 24/0 కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నట్టు చెప్పారు. ఎక్ఛేంజ్ బోనస్ కూడా ఉందని తెలిపారు.

బాలల సాంస్కృతికోత్సవానికి దరఖాస్తులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నగరంలో బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు, సృజనాత్మక రచన అధ్యయనం శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుతాలు సృష్టించి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలను పంచుకొని తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారని తెలిపారు. పోటీలు రెండు రకాలు నిర్వహిస్తున్నామని, అందులో విద్యార్థులు రెండు పేజీలకు మించకుండా కథ, 20 పంక్తులకు మించకుండా ఏదేని అంశంపై వచన కవిత, ఐదు పద్యాలకు మించకుండా పద్య కవితా పోటీకీ రాసి పంపించవచ్చన్నారు. చిత్రలేఖనం చేసి పంపించవచ్చు అని సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, హైదరాబాద్ -1 చిరునామాకు పంపించాలని కోరారు. ఉత్సవం రోజున మేకప్ లేకుండా ఏకపాత్రాభినయం, దేశభక్తి, లలిత గీతాలాపన, వ్యాస రచన, వక్తృత్వం, పుస్తక సమీక్ష పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. అక్టోబర్ 10వ తేదీలోపు ఫోన్ నం. 96037 27234కు వాట్సాప్ ద్వారా వివరాలను విద్యార్థులు, ప్రతినిధులు పంపించాలని చెన్నయ్య కోరారు.

లిడ్ క్యాప్‌ను పునరుద్ధరించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20: లిడ్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) క్యాప్‌ను టీజీఎల్ఐపీసీ (తెలంగాణ లెదర్ ఇండస్ట్రీయల్ ప్రమోషన్ కార్పొరేషన్)గా పునరుద్ధరించి దానికి చైర్మన్, డైరెక్టర్లను నియమించి, మూడు వేల కోట్లు బడ్జెట్‌ను కేటాయించాలని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ ఛర్మకారుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా కొత్తగూడం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడారు. లిడ్ క్యాప్‌ను టీజీఎల్ఐపీసీగా పునరుద్ధరించాలని అన్నారు. కమ్యూనిస్టులు పేదవారి కోసమే పోరాటం చేశారని తెలిపారు. ఆర్థిక సమానత్వం వచ్చినప్పుడే కులం పోతుందని పేర్కొన్నారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ కాశీం, జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్, బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, జేఏసీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాజమౌళి, అందే ఆనందరావు పాల్గొన్నారు.

ఖాదీ కళాకారులకు కేవీఐసీ బహుమతులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని లక్షలాది మంది ఖాదీ కళాకారులకు కేవీఐసీ బహుమతులను అందిస్తున్నామని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. అదే విధంగా మహాత్మాగాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి స్పిన్నర్ల వేతనాన్ని 25 శాతం, చేనేత కార్మికుల వేతనాలను ఏడు శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఖాదీ కుటుంబ కళాకారులకు ప్రయోజనాలను అందించాలన్న ప్రధానమంత్రి ఆలోచనలకు ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 3000 నమోదిత ఖాదీ సంస్థలు ఉన్నాయన్నారు.